సాక్షి
మంచిర్యాల

శనివారం, 2, డిసెంబర్, 2023



తిరుగు ప్రయాణం పాట్లు

ఓట్ల పండుగకు సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం అయ్యారు. మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సుల్లో టికెట్లు ముందస్తు బుకింగ్ చేసుకున్నారు. 8లో▸



లెక్కింపు కేంద్రం వద్ద బందోబస్తు

హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

గూడెంలో కొనసాగుతున్న రద్దీ



సత్యనారాయణ వ్రతంలో భక్తులు

దండేపల్లి: కార్తీకమాసం సందర్భంగా మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సత్యదేవుణ్ని దర్శించుకున్నారు. 313 మంది జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.


దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



బాధితుడితో మాట్లాడుతున్న రఘునాథ్

శ్రీరాంపూర్: ఎన్నికల సమయంలో అక్రమంగా తమ పార్టీ బూత్ నాయకుడు రణదీప్‌పై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ రావు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ హిమ్మత్‌నగర్‌లో బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. దాడి హేయమైన చర్యగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికావని, పద్ధతి మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం శ్రీరాంపూర్ ఎస్సై రాజేశ్‌కు ఫోన్ చేసి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్రం రమేష్, ఈర్ల సదానందం, సిరికొండ రాజు, మెరుగు శ్రీను, మధు రావు, సత్యం, చొప్పదండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆదరణ ప్రకారమే ముందుకెళ్తాం



మాట్లాడుతున్న కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టబోతున్నారని, ప్రజలు తమపై చూపిస్తున్న ఆదరణ ప్రకారమే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకెళ్తామని ఆ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ప్రజలు అధికారంలోకి తీసుకొచ్చేందుకు కంకణబద్ధులు కావడం అభినందనీయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టగానే హామీలను అమలు చేస్తుందని భరోసా ఇచ్చారు. ఇంద్రవెల్లి, నస్పూరులో కాంగ్రెస్ సభలు విజయవంతానికి కార్యకర్తలు కారణమని, అదువల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం, ప్రజల్లో నమ్మకం కలిగిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడడం వల్లనే కాంగ్రెస్ గెలుపు దిశగా వెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఎవరి లెక్కలు వారివే !

- పైకి గెలుపు ధీమా.. లోన భయం
- చెన్నూరులో పోటాపోటీ ఉన్నట్లు అంచనా
- మంచిర్యాలలో భయపెడుతున్న 'కమలం'?
- ఎగ్జిట్ పోల్స్‌తో అభ్యర్థుల్లో హైరానా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అందరి దృష్టి నెలకొంది. ఎక్కడ చూసినా ఎవరు గెలుస్తారనే చర్చ జరుగుతోంది. గత నెల 30న పోలింగ్ ముగిసినప్పటి నుంచే చర్చలు ఊపందుకున్నాయి. ఎవరు ఓడుతారు..? ఎవరు గెలుస్తారు..? అని అటు రాజకీయ పార్టీలతోపాటు జిల్లా ప్రజల్లో ఉత్కంఠగా మారింది. హోరాహోరీగా సాగిన పోరులో ఎవరు విజేతగా నిలుస్తారనేది ఈ నెల 3న ఓట్ల లెక్కింపుతో వెల్లడి కానుంది. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి తక్కువ పోలింగ్ నమోదైంది. దీంతో ఎవరికి మేలు, ఎవరికి నష్టం జరిగిందనే చర్చ నడుస్తోంది. అభ్యర్థులు మాత్రం ఎవరికి లెక్కలతో వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. లోపల ఒకింత ఆందోళన నెలకొన్నప్పటికీ తాము గెలుస్తామనే ధీమా ప్రదర్శిస్తున్నారు. బూత్‌ల వారీగా ఎక్కడ ఎన్ని ఓట్లు వచ్చాయో బూత్ ఇన్‌చార్జీలతో ఆరా తీస్తున్నారు. తక్కువ, ఎక్కువ ఓట్లు పోలైన ప్రాంతాలు, గ్రామాలు, మండలం, పట్టణాల్లో ఎవరెవరు ఎటు వేశారని సమాచారం సేకరిస్తున్నారు. ఓటర్లు ఎటు ఓటు వేశారనే దాన్ని బట్టి సమాలోచనలు చేస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో ఓట్లు పడిన తీరుపై ఇప్పటికే అంచనాకు వచ్చారు. జిల్లాలో ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులే ప్రధాన ఓటు బ్యాంకును రాబట్టినట్లుగా చెప్పుకుంటున్నారు. చాలాచోట్ల సర్కారుపై ఉన్న వ్యతిరేకత, కాంగ్రెస్ పార్టీ గాలి ఊపునిచ్చినట్లుగా ఊహిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరికి మేలు చేస్తుందో.. నష్టం జరిగిందోనని ఎవరికి వారు విశ్లేషణలు చేస్తున్నారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో రాజకీయ పార్టీల నాయకులు హైరానా పడుతున్నారు.



హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపర్చిన ఈవీఎంలు

'కమలం' పుంజుకుందా?

జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో, జన్నారం(ఖానాపూర్) పరిధిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్యే ఓట్ల పోటాపోటీ సాగింది. మంచిర్యాల నియోజకవర్గంలో ఈసారి బీజేపీ ప్రభావం ఉంటుందనే ఆ పార్టీ నాయకులు నమ్మకం పెట్టుకుంటున్నారు. దీంతో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో త్రిముఖ పోటీతో ఆ ఓట్లు చీలిపోయినట్లుగా అంచనా వేస్తున్నారు. దీంతో మంచిర్యాల నియోజకవర్గంలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ త్రిముఖ పోటీ ఉంటే ఎవరికి మేలు చేస్తుందోననే విశ్లేషణలు జరుగుతున్నాయి. గత ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య ప్రధాన పోటాపోటీగా సాగింది. ఈసారి బీజేపీ అభ్యర్థి సైతం గౌరవ ప్రదమైన ఓట్ల కోసం కొన్ని కాలనీలు, గ్రామాల ఓట్లే లక్ష్యంగా పని చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఇందుకోసం భారీగా వెచ్చించినట్లుగా నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో అన్ని విధాలుగా ఓటర్లకు 'ప్రసన్నం' చేసుకోవడంతో కొంత ఓటు బ్యాంకు మెరుగైందనే ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ఈ క్రమంలో బీజేపీకి పెరిగిన ఓట్లు కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చుతుందా? అదే సమయంలో బీఆర్‌ఎస్‌కు మేలు జరిగే అవకాశం లేకపోలేదు. ఈ క్రమంలో ఎవరికి ఎన్ని ఓట్లు పడతాయోనని పోలింగ్ పూర్తయినప్పటి నుంచే విశ్లేషణలు కొనసాగుతున్నాయి. రేపు అధికారికంగా ఫలితాలు వెల్లడయ్యే వరకు ఈ చర్చలు కొనసాగనున్నాయి.

బెల్లంపల్లి, చెన్నూరులో రెండింటి మధ్యే

బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే పోటీ జరిగింది. గ్రామాలు, పట్టణాలు, సింగరేణి కాలనీ పరిధిలో కార్మిక కుటుంబాలు ఇక్కడ కీలకం. వీరంతా ఎటువైపు మొగ్గు చూపారనేది ఆసక్తిగా మారింది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పడ్డాయని ఆ పార్టీ నాయకులు విశ్వాసంతో ఉన్నారు. తమకు కూడా ఏమాత్రం ఓట్లు తగ్గలేదని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చెబుతున్నారు. మరోవైపు బీజేపీ అభ్యర్థులు సైతం తమకు చెప్పుకోదగ్గ ఓట్లు వస్తాయనే ధీమాలో ఉన్నారు. ఈ క్రమంలో ఇక్కడ ఎవరి వైపు ఓట్లు మళ్లాయనేది ఆసక్తిగా మారింది. చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య పోటాపోటీగా సాగింది. ఇరు పార్టీల అభ్యర్థులు ప్రచారం, బహిరంగ సభలు, ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేశారు. బెల్లంపల్లి, మందమర్రిలో సీఎం కేసీఆర్‌తో భారీ బహిరంగ సభలు, చెన్నూరులో మంత్రి కేటీఆర్ రోడ్ షోలు నిర్వహించారు. ఈ ప్రచార సభలతో తమకు హైప్ పెరిగిందని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ఇక ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, కార్యకర్తలు, నాయకుల కుటుంబాల ఓట్లే తమకు ప్రధాన బలంగా చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో ఓటరు నాడీ ఎలా ఉండబోతోందనే ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య గట్టిపోటీ ఉన్నట్లుగా అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఎవరిని గెలుపు వరిస్తుందో వేచి చూడాలి.

ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత



డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ

మంచిర్యాలటౌన్: ఎయిడ్స్ నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై మాట్లాడేందుకు ప్రజలు ఇబ్బంది పడుతుంటారని, కానీ ఈ మహమ్మారిని పారద్రోలేందుకు అనుమానితులు హెచ్‌ఐవీ పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. దీనిపై గురించి ప్రజలకు వీలైనంతగా ఎక్కువగా చేరవేసి, ఈ వ్యాధి ప్రబలకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గులు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ వి.అనిల్‌కుమార్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమా, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, డీఎంహెచ్‌వో సిబ్బంది అల్లాడి శ్రీనివాస్, నాందేవ్ రామ్మూర్తి, డెమో వెంకటేశ్వర్లు, స్నేహ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఎయిడ్స్ నివారణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి, వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 ప్రోగ్రాం ఆఫీసర్లు వి.స్వప్న, ఎం.జ్యోతి, సభ్యులు టి.రమాదేవి, ఏ.భాగ్యలక్ష్మి, వి.దివ్య, కె.అంజలి పాల్గొన్నారు.

ఏ పార్టీకి ఎన్ని ఓట్లు..



కాసిపేట మండలం లంబాడితండా పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన యువకులు(ఫైల్)

- ఎన్నికల్లో ఓట్లపై పార్టీల పోస్టుమార్టం
- పోలింగ్ కేంద్రాల వారీగా అంచనాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసిన ప్రధాన రాజకీయ పార్టీల్లో తీవ్ర ఉత్కంఠ కనిపిస్తోంది. గురువారం జరిగిన పోలింగ్ సరళిపై దృష్టి సారించి ఎక్కడ ఎవరికి ఎక్కువ ఓట్లు పడ్డాయనే పోస్టుమార్టం మొదలైంది. బెల్లంపల్లి నియోజకవర్గ ఓట్లను ఆదివారం మంచిర్యాలలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో లెక్కించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ప్రధాన రాజకీయ పక్షాల శ్రేణులు ఓట్ల లెక్కలు వేసే పని నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో 1,73,335 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,40,735 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 70,904 మంది, మహిళలు 69,823 మంది ఓటు వేశారు. 81.19శాతం పోలింగ్ నమోదైంది. ఏ రాజకీయ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. ఓట్ల లెక్కల్లో ఆయా రాజకీయ పార్టీల శ్రేణులు కుస్తీ పడుతూ గెలుపోటములపై అంచనాకు వస్తున్నారు.

ఏ మండలంలో ఎన్ని ఓట్లు వస్తాయో..

నియోజకవర్గంలో తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాలతోపాటు బెల్లంపల్లి మున్సిపాలిటీ ఉన్నాయి. ఆయా మండలాల్లో సగటున 60 శాతం నుంచి 90 శాతం పైబడి ఓట్లు పోలయ్యాయి. ఒక్కో మండలంలో ఒక్కో తీరుగా పోలింగ్ శాతం నమోదు కావడంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కలు వేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీకి ఎన్ని ఓట్లు, తమ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయో విశ్లేషిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల గణాంకాలను బేరీజు వేస్తూనే మొత్తంగా ఒక్కో మండలం నుంచి ఎన్ని ఓట్లు రానున్నాయనే తర్జన భర్జన పడుతున్నారు. ఓట్ల సరళిని గ్రామాల్లో ఓటర్ల ద్వారా అడిగి తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అన్ని రకాల విశ్లేషణలు, అంచనాలతో ఎవరికి వారు తమ పార్టీనే గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటర్లు ఓ ప్రధాన రాజకీయ పార్టీ పేరును ప్రముఖంగా చెబుతుండడంతో ప్రత్యర్థి రాజకీయ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. పైకి గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా అంతర్గతంగా అందరి నోటా ఓటమి మాట వినిపిస్తుండడంతో తీవ్రంగా మదనపడుతున్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ

ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన బెల్లంపల్లిలో ఈసారి 13 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ కేంద్రీకృతమైనట్లు తెలుస్తోంది. మిగతా అభ్యర్థులు అంతంత మాత్రంగా ప్రభావం చూపే అవకాశాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్రస్థాయిలో ప్రచారం చేసి ఓటర్లను ఆకర్షించారు. ఆఖరు దశలో పోల్ మేనేజ్‌మెంట్ నిర్వహించడంలోనూ నువ్వా నేనా అనే రీతిలో పోటీ పడ్డట్లుగా తెలుస్తోంది. ఎవరికి మెజార్టీ ఓట్లు పడ్డాయనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఎక్కడ నలుగురు గుమిగూడినా అభ్యర్థుల జయాపజయాలపై చర్చ జరుగుతోంది. ఏయే గ్రామాల్లో ఆధిక్యత వస్తుందనే ఆశతో ఆయా పార్టీలు అనుసరించిన పోల్ మేనేజ్‌మెంట్ చేసిన తీరును, ఆ గ్రామంలో పార్టీ పట్టు, కలిసి వచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుని గెలుపోటములపై అభిప్రాయానికి వస్తున్నారు. ఎవరి ధీమా ఎలా ఉన్నా ఆదివారం ఫలితం తేలనుంది.

'పల్లె'వించిన ఓటు చైతన్యం



కోటపల్లి మండలం పారుపల్లి గ్రామంలో బారులు తీరిన జనం(ఫైల్)

- గ్రామాల్లో 90 శాతానికి పైగా పోలింగ్
- పట్టణాల్లో తగ్గిన ఓటింగ్ శాతం

చెన్నూర్: ఓటర్లను చైతన్యపర్చి వంద శాతం ఓటింగ్ నమోదయ్యేలా పల్లె, పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల సంఘం అవగాహన సదస్సులు, వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. దీంతో గ్రామీణ ప్రాంత ఓటర్లలో కొంత మార్పు కనిపించింది. చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పట్టణ ప్రాంతాలతో పోలిస్తే పల్లెల్లో కొంత మేర పోలింగ్ శాతం మెరుగైంది. పట్టణ ప్రాంతాల్లో 88శాతానికి మించి పోలింగ్ నమోదు కాలేదు. గ్రామాల్లో మాత్రం 90శాతానికి పైగా ఓటింగ్ శాతం నమోదు కావడం గమనార్హం. నియోజకవర్గంలో 1,88,283 మంది ఓటర్లు ఉండగా 80.07 పోలింగ్ శాతం నమోదైంది. ఇందులో 75,558 మంది పురుషులు, 75,194 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఓటు వేశారు. మొత్తంగా 1,50,754 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కోటపల్లి మండలంలోని బొప్పారం గ్రామంలో 91.30శాతం, రాంపూర్‌లో 91.35, అన్నారంలో 91.12, రాయ్యలపల్లిలో 92.21, ఎదుల్లబంధంలో 94.80, పారిపల్లిలో 90.23, లింగన్నపేటలో 93.44, పంగిడిసోమారంలో 92.22, అశ్వరావుపేటలో 90.69శాతం పోలింగ్ నమోదైంది.



ఆర్మేపీలో ఓటు హక్కు వేసిన దివ్యాంగుడు



స్ట్రాంగ్ రూములో ఈవీఎంలు పరిశీలిస్తున్న బిశ్వజిత్ దత్తా, జిల్లా ఎన్నికల అధికారి సంతోష్, ఆర్‌ఓ రాహుల్



సీజ్ చేసిన చెన్నూర్ స్ట్రాంగ్ రూము వద్ద అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/చెన్నూర్‌రూరల్: జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంల ను హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలో ఉన్న ఐజా ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంకు తరలించారు. 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించనున్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను స్ట్రాంగ్ రూముల్లో రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్షంలో భద్రపర్చి సీజ్ చేశారు. లెక్కింపు కేంద్రాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్‌దత్తా, నజీబ్ ఆర్, పోలీస్ పరిశీలకులు ఆర్.ఇలాంగో, బెల్లంపల్లి ఆర్‌ఓ, అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, చెన్నూర్ ఆర్‌ఓ సిడాం దత్తు, మంచిర్యాల ఆర్‌ఓ రాములు పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పంపిణీ కేంద్రం నుంచి ఈవీఎంలను శుక్రవారం మంచిర్యాలలోని కౌంటింగ్ కేంద్రానికి కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య తరలించారు.

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ముగిసిన తర్వాత ఈవీఎంల తరలింపు ప్రక్రియ చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతంగా ప్రకటించిన ఎన్నికల సంఘం గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించి సాయంత్రం 4 గంటల వరకు ముగించింది. అప్పటికే అనేక పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి ఉండడంతో చిట్టీలు అందజేసి రాత్రి 7 గంటల వరకు ఓట్లు వేయించారు. ఆ తర్వాత ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్ల సమక్షంలో ఒక్కో పోలింగ్ కేంద్రంలో పోలైన ఓట్ల సంఖ్యను సరి చూసుకుని ఈవీఎం, వీవీ ప్యాట్లను సీజ్ చేశారు. ఈ తంతు పూర్తి చేయడానికి పోలింగ్ అధికారులకు అదనంగా గంట సమయం పట్టినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ప్రత్యేక వాహనాల్లో పోలీసు బందోబస్తు మధ్య నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూంలకు తరలించారు. మరోమారు పరిశీలించి శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చారు.



లెక్కింపు కేంద్రానికి చేరుకున్న ఓటింగ్ యంత్రాలు

ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్..!

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్ సాగుతోంది. అభ్యర్థుల గెలుపు ధీమాతో సొంత పార్టీలోని వారితోపాటు ఇతరులు కూడా పందెం కాస్తున్నారు. నియోజకవర్గంలో 17మంది బరిలో ఉండగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల గెలుపు బెట్టింగ్ నడుస్తోంది. ఎక్కడ ఏ నలుగురు కలిసినా గెలుపోటములపై ఆరా తీస్తున్నారు. రూ.వేల నుంచి రూ.లక్షల్లో పందెం సాగుతోంది. వీటిలో టూర్లు, దావత్‌లు ఇంకా ఎన్నో రకాలుగా జరుగుతున్నాయి.



క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


నరహరిగౌడ్(ఫైల్)

జైపూర్: జైపూర్ మండలం షెట్‌పల్లి గ్రామానికి చెందిన కారకొప్పుల నరహరిగౌడ్(27) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. నరహరి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు స్వగ్రామమైన షెట్‌పల్లి గ్రామానికి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు. మృతుడికి 13 రోజుల పాప ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త ఆత్మహత్య


జ్యోతికతో సాయితరుణ్ సెల్ఫీ(ఫైల్)

జైపూర్: వారిద్దరూ ప్రేమించుకున్నారు. కులాలు వేరైనప్పటికీ పెద్దలను ఎదిరించి పెండ్లి చేసుకున్నారు. ఊహించని విధంగా ప్రేయసి మరణించింది. ఆ మరణాన్ని తట్టుకోలేక ప్రియుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృత్యువాత పడిన సంఘటన షెట్‌పల్లిలో విషాదం నింపింది. మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన ఆసంపల్లి సాయితరుణ్(22) ఇదే షెట్‌పల్లి గ్రామానికి చెందిన జ్యోతిక ఇద్దరూ ప్రేమించుకోగా కులాలు వేరుకావడంతో పెద్దలు అంగీకరించకపోవడంతో వారిని ఎదిరించి ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. జ్యోతిక గర్భం దాల్చడంతో రక్తహీనతతో నెల కిందట ఆస్పత్రిలో మృతిచెందింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సాయితరుణ్ వారం రోజుల కిందట పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రి తరలించి వైద్యం అందించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లుగా తెలిపారు. మృతుడు నస్పూర్ మున్సిపాల్టీ పరిధిలోని సీసీసీలో నివాసం ఉంటుండగా మృతదేహాన్ని స్వగ్రామమైన షెట్‌పల్లికి తరలించారు. నెల రోజుల్లోనే ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరులా రోదించారు.

ఎమ్మెల్యే అభ్యర్థిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీచేసిన బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావుపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 30న జరిగిన ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ విధించారు. 144 సెక్షన్ కోడ్ ఉల్లంఘించి దివాకర్‌రావు తన అనుచరుతో కలిసి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ప్రచారం చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని స్వతంత్య్ర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ నయీమ్ పాషా వీడియోతో పాటు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాడు. దీంతో దివాకర్‌రావ్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

ఎమ్మెల్యే అభ్యర్థి చిన్నయ్యపై కేసు

నెన్నెల: బెల్లంపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. చిన్నయ్య గురువారం తన స్వగ్రామం జెండావెంకటాపూర్‌లో పార్టీ కండువా వేసుకుని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేశారు. ఎన్నికల నిబంధన ఉల్లంఘించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. స్పందించిన ప్రిసైడింగ్ అధికారి ఒజ్జాల రాజశేఖర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీ: 18K ఫోన్: 9840258889/ 9840468889 [H-793659]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

ఓటింగ్‌పై ఆరా


కార్యాలయంలో ఆత్మీరా శ్యాంనాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆజ్మీరా శ్యాం నాయక్ శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆరాధ్య దైవాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. గురువారం జరిగిన పోలింగ్ సరళిపై తెలుసుకున్నారు. ఆయా మండలాల్లో పార్టీకి పడిన ఓట్ల శాతంపై అంచనా వేసుకున్నారు. పార్టీకి అనుకూలంగా ఉండడంతో 40వేల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- రెండు నెలలు ప్రజల మధ్యలో నాయకులు
- ఎన్నికలు ముగియడంతో కుటుంబ సభ్యులతో సరదాగా

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు గత రెండు నెలలుగా ఎన్నికల ప్రచారం, వ్యూహప్రతివ్యూహాలతో క్షణం తీరిక లేకుండా గడిపారు. గురువారం పోలింగ్ ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడిపారు. ఇంటికి వస్తున్న కార్యకర్తలు, నాయకులతో చర్చిస్తూనే కుటుంబానికి సమయం కేటాయించారు. రెండు నెలల కష్టాన్ని రెండ్రోజుల్లో మరిచిపోయేలా కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా కనిపించారు.

- మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తన భార్య, కోడలు, మనవరాళ్లతో ప్రశాంతంగా గడుపుతూనే, ఎన్నికల సరళి ఏ విధంగా జరిగిందని నాయకులతో చర్చించారు.
- మంచిర్యాల బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు తన భార్య, ఇద్దరు కుమారులు, కోడలు, మనవరాళ్లతో సరదాగా గడిపారు.
- మంచిర్యాల బీజేపీ మంచిర్యాల అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి కుటుంబ సభ్యులందరితో శుక్రవారం సరదాగా గడిపారు.
- చెన్నూరు బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్ అయ్యప్ప మాల ధరించి ఇంటికి వచ్చిన అయ్యప్ప స్వాములతో చర్చించారు.
- బెల్లంపల్లి బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపారు. అత్త, ఆడబిడ్డ, కూతుళ్లతో కులాసాగా గడిపి రాజకీయ వాతావరణం నుంచి కాస్త ఉపశమనం పొందారు. ఇంటిల్లిపాదికి వంటలు చేసి రుచి చూపించారు.

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆసిఫాబాద్ బీజేపీ అభ్యర్థి అజ్మీర ఆత్మారాంనాయక్ శుక్రవారం గోలేటిలో పార్టీ కార్యకర్తలతో గెలుపోటములపై సుదీర్ఘ చర్చలు జరిపారు. నియోజకవర్గంలో పోలైన ఓట్లు, గ్రామాల వారీగా పడిన ఓట్లపై చర్చించారు.

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కోనేరు కోనప్ప కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో తన నివాసంలో సమావేశం అయ్యారు.

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, సిర్పూర్ బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కోసినిలోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో గడిపారు. పలు కాలనీల్లో ఉన్న కార్యకర్తల నివాసాలకు వెళ్లి కలిశారు.
- బీజేపీ సిర్పూర్ అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సర్‌సిల్క్‌లోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమయాన్ని గడుపుతూ కనిపించారు.


కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి


కుటుంబ సభ్యులతో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు


కుటుంబ సభ్యులతో పాయసం తింటున్న శ్రీదేవి

- కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ అభ్యర్థి రావి శ్రీనివాస్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ స్కూల్ వెనుక ఉన్న ఆయన ప్లాంట్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమయాన్ని గడిపారు.

పోలింగ్ సరళిపై అంచనా


నాయకులు, కార్యకర్తలతో కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి శుక్రవారం తన నివాసంలో కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడిపారు. అనంతరం ఆయా మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పోలింగ్ సరళిపై తెలుసుకున్నారు. ఏ మండలంలో పార్టీకి ఎంత శాతం ఓట్లు పడే అవకాశం ఉందని ఆరా తీశారు. పోలింగ్ సరళిని పరిశీలిస్తే బీఆర్‌ఎస్ విజయం ఖాయమని, 10వేల నుంచి 20వేలలోపు మెజార్టీతో విజయం సాధిస్తామని కోవ లక్ష్మి ధీమా వ్యక్తం చేశారు.


పార్టీ నాయకులతో బీఎస్పీ అభ్యర్థి ఆర్‌ఎస్పీ


అయ్యప్ప దీక్ష స్వాములతో మాట్లాడుతున్న చెన్నూర్ బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్


కుటుంబ సభ్యులతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు


తన నివాసంలో మనుమరాలితో ముచ్చటిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


రెబ్బెన: గోలేటిలో కార్యకర్తలతో చర్చిస్తున్న బీజేపీ అభ్యర్థి అజ్మీర ఆత్మారాం నాయక్


తన నివాసంలో కార్యకర్తలతో బీజేపీ అభ్యర్థి డాక్టర్ హరీష్ బాబు


పార్టీ శ్రేణులతో కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్

ఎర్రచెరువులో పడి బాలుడి మృతి


ప్రణీత్ (ఫైల్)

మందమర్రిరూరల్: చెరువులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన మందమర్రి మండలంలోని అందుగులపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం... అందుగులపేట గ్రామానికి చెందిన నవనందుల ప్రణీత్(14), మేకల అక్షిత్, మన్నె మహేష్ గురువారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని కొత్త చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో చేపలు పట్టేందుకు ఉంచిన (థర్మకోల్ షీట్‌తో చేసిన) తెప్పపై ముగ్గురు చెరువులోకి వెళ్లారు. చెరువు మధ్యలోకి వెళ్లగానే తెప్ప అదుపు తప్పడంతో అందులో పడిపోయారు. మహేష్, అక్షిత్ ఈతకొడుతూ బయటకు వచ్చారు. ఈత రాకపోవడంతో ప్రణీత్ నీటిలోనే మునిగిపోయాడు. కొంత సేపటి తర్వాత మహేష్, అక్షిత్ చెరువులోకి వెళ్లి ప్రణీత్‌ను బయటకు తీసుకువచ్చి పొట్టలోని నీళ్లు తీసే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందాడు. అయితే ప్రణీత్ తల్లిదండ్రులు స్వగ్రామం కాసిపేట మండలం వల్లంగూడ కావడంతో ఓటువేయడానికి వెళ్లి వచ్చేసరికి కనిపించలేదు. తల్లిదండ్రులు ఆరా తీయగా రాత్రి కుమారుడు మృతిచెందిన విషయం బయటకువచ్చింది. తన కుమారుడిని ఎవరో హత్య చేసి ఉంటారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం బాలుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

కేస్లాపూర్‌లో యువకుడి దారుణ హత్య


దాడికి గురైన వ్యక్తిని పరిశీలిస్తున్న ఏసీపీ సదయ్య

భీమిని: పాత కక్షల నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తిని కత్తితో దాడిచేసి హత్య చేసిన సంఘటన మండలంలోని కేస్లాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కేస్లాపూర్ గ్రామానికి చెందిన బొడ్డు వెంకటి-లక్ష్మి దంపతుల మూడో కుమారుడు బొడ్డు జలేందర్(38) అదే గ్రామానికి చెందిన ముత్యం రాజశేఖర్‌గౌడ్‌ల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. కోపం పెంచుకున్న రాజశేఖర్ శుక్రవారం రాత్రి భీమిని వైపు నుంచి కేస్లాపూర్‌కు వెళ్తున్న జలేందర్‌ను కేస్లాపూర్ గ్రామం పరిధిలోని హన్మాన్ ఆలయం వద్ద కత్తితో దాడికి పాల్పడ్డాడు. విచక్షణరహిత్యంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి 108లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లుగా తెలిపారు. ఎస్సై ప్రశాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ సదయ్య బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య శారద, ముగ్గురు కూతుళ్లు మేఘన, మేనక, రక్షిత ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

లెక్కింపు కేంద్రం వద్ద భారీ బందోబస్తు


ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో లెక్కింపు కేంద్రం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్ పరిశీలకుడు ఆర్.ఇలాంగో, రామగుండం సీపీ రెమారాజేశ్వరితోపాటు మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. లెక్కింపు కేంద్రం మొత్తం మూడంచెల భద్రత పరిధిలో ఉండగా లెక్కింపు కేంద్రం చుట్టూ పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ వేశారు. లెక్కింపు కేంద్రం బయట కూడా దాదాపు 500 మీటర్ల వరకు కూడా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. ఎన్నికల అధికారులు, లెక్కింపు అధికారులు, పోలీస్ అధికారుల వాహనాల పార్కింగ్‌తోపాటు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్ల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక సౌకర్యం కల్పించారు. లెక్కింపు కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలతోపాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సీఆర్‌పీఎఫ్, ప్రత్యేక పోలీస్ బలగాలతో పాటు జిల్లా పోలీస్ సిబ్బంది బందోబస్తులో భాగస్వామ్యమయ్యారు. లెక్కింపు రోజు పూర్తి స్థాయిలో పరిశీలించిన మీదటే లోనికి పంపేలా ఆదేశాలతో ఆంక్షలు పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

వైన్ షాపు ఏర్పాటును అడ్డుకున్న మహిళలు


వైన్‌షాపును అడ్డుకున్న మహిళలు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా జనావాసాల్లో వైన్ షాపు ఏర్పాటును శుక్రవారం ఆ కాలనీ మహిళలు అడ్డుకున్నారు. కొత్త షాపుల ఏర్పాటు శుక్రవారం నుంచి మొదలు కావడంతో వైన్ నిర్వాహకుడు భాగ్యనగర్ కాలనీలో షాపు ఏర్పాటుకు పూనుకున్నాడు. నూతనంగా ఏర్పాటు చేసే షాపుకు ప్లెక్సీ ఏర్పాటు చేయడంతో ఆ కాలనీ మహిళలు, కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ షాపు తొలగించాలని పట్టుబట్టారు. సమీపంలో పలు పాఠశాలలు కూడా ఉన్నాయని వేరే చోట వైన్ షాపు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ


ర్యాలీ తీస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు

మంచిర్యాలటౌన్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి పట్టణ వీధుల్లో శుక్రవారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ ఎలా సోకుతుంది, నివారణ కోసం చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ, వ్యాధి సోకిన వారికి అందిస్తున్న చికిత్స వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ డెమో బుక్క వెంకటేశ్వర్, ఎయిడ్స్ జిల్లా సూపర్‌వైజర్ అనిల్, స్నేహ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణం పాట్లు


బస్‌స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్ వద్ద ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: ఓట్ల పండుగకు సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగుప్రయాణం మొదలెట్టారు. మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సుల్లో టికెట్‌లు అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నారు. విద్య, ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లు సొంతూళ్ల బాట పట్టిన వారంతా తిరుగుముఖం పట్టారు. మంచిర్యాల బస్టాండ్ శుక్రవారం హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల వద్ద ప్రయాణికుల రద్దీతో నిండిపోయింది. ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు వీలుగా ఆయా సంస్థలు ఒక్కరోజు సెలవులు ప్రకటించాయి. ఓట్లు వేసిన అనంతరం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారితోపాటు ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులు హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అత్యవసరంగా వెళ్లాలనుకునే వారు బస్సుల్లో సీటు దొరకపోతే సొంత వాహనాలు, అద్దెవాహనాలు ఆశ్రయించారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంటల నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ పెరుగుతూ వచ్చింది. రోజువారీ 15 బస్సులకు అదనంగా మరో ఆరు బస్సులను ఏర్పాటు చేశారు. శుక్రవారం బస్సుల్లో కూడా అడ్వాన్స్ టికెట్లు కొనుగోలు చేశారు. అదనంగా మరో నాలుగు బస్సులు ఏర్పాటు చేశారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతామని డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తాం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లాలో ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తామని కాంగ్రెస్ పార్టీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు పూర్తి కావడంతో వారు గెలుపుపై అభిప్రాయాన్ని వెల్లడించారు.

ఉమ్మడి జిల్లాలో ఏడు సీట్లు సాధిస్తాం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసెంబ్లీ స్థానాలు ఏడింటివి బీజేపీ పార్టీ గెలుస్తుంది. జిల్లాలో మంచిర్యాల నియోజకవర్గం గెలుపు ఖాయమే. ప్రజలు బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని నమ్మారు. గతంతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో ప్రజలు పార్టీ వైపు మొగ్గు చూపారు. ఓటింగ్ శాతం పెరగడంతోపాటు గెలుపు దిశగా ముందుకు వెళ్తోంది.

– రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

మూడుస్థానాల్లో గెలుపు



రాష్ట్రంలో, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గెలుపు దిశగా పయనిస్తుంది. రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడం, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజల్లో నమ్మకం కలగడంతో ఈసారి కాంగ్రెస్ గెలుపును ప్రజలు కోరుకున్నారు. ఇంద్రవెల్లిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో నిర్వహించిన కాంగ్రెస్ సభ విజయవంతం, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ సభను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో నిర్వహించిన సభ విజయవంతంతో రాష్ట్రంలోనే పార్టీలో ఉత్తేజం వచ్చింది. అదే ఇప్పటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు దిశ వరకు కొనసాగింది. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి వడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం.– కొక్కిరాల సురేఖ, డీసీసీ అధ్యక్షురాలు

బీఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్తపై కాంగ్రెస్ నాయకుల దాడి


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- వాట్సాప్ వార్.. దాడికి దారితీసిన వైనం
- పోలీసుల అదుపులో నిందితులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ శ్రీరాముల సుజాత భర్త మల్లేష్‌పై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దాడికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే... మంచిర్యాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి శ్రీరాముల సుజాత పోటీ చేసి గెలిచింది. గెలిచిన తర్వాత బీఆర్‌ఎస్ పార్టీలో చేరింది. పట్టణంలో జరిగిన ఓ విందు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ సుజాత భర్త మల్లేష్‌లు వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ టికెట్ మీద గెలిచి కౌన్సిలర్ అయి బీఆర్‌ఎస్‌లో చేరాడని కామెంట్ చేశారు. విందు కార్యక్రమం అనంతరం అందరూ వెళ్లిపోయారు. సాయంత్రం కాంగ్రెస్ నాయకులు మల్లేష్‌కు ఫోన్లు చేయడం, వాట్సాప్‌లో అసభ్యకరంగా మెస్సెజ్‌లు చేయడంతో మల్లేష్ సైతం అదే తరహాలో బదులిచ్చాడు. దీంతో ఇరువురి మధ్య కాసేపు వాట్సాప్ వార్ జరిగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు తోట తిరుపతి, జానేష్, మహేష్, కిషోర్ బాబు, రవిలు మరికొంత మంది సాయంత్రం మల్లేష్ ఇంటికి వచ్చి దాడికి పాల్పడ్డారు. అడ్డుకున్న కుటుంబ సభ్యులపై సైతం దాడి చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ రాజు, ఎస్సై రాజేందర్‌లు ఘటనా స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా...

మంచిర్యాలటౌన్: 15వ వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సుజాత భర్త శ్రీరాముల మల్లేశ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం బీఆర్‌ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు మాట్లాడుతూ దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై చట్టప్రకారంగా కఠిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో ఇలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని అన్నారు. పోలీసులు వెంటనే తగిన చర్యలను తీసుకుని, మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా చర్యలను తీసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకుల ధర్నాతో గంటన్నర పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలానికి డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ చేరుకుని దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమింపజేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.